

# ధర్మపాలుడు

అది బ్రిటిష్ హయాం.

మున్సబు హనుమయ్య పేరు చెబితే వూరంతా వొణికిపోయి చేతులు కట్టుక్కు నుంచునేవారు. ధ్వజ స్తంభంలా ఏడడుగుల మనిషి. నల్లటి నలుపు. విచ్చుకున్న పత్తికాయల్లా తెల్లటి కళ్ళు. అందులో ఎర్ర జీరలు. పొంగిన బుగ్గల మీద ఇరు పక్కలా వింజామరల్లా పరుచుకున్న బుంగమీసాలు. హనుమయ్య ఒక చేత్తో మీసం సవరించుకుంటుంటే చెంపంతా నిమురుకుంటున్నట్టుండేది. ఆజానుబాహు వైన హనుమయ్య ఒక చేత్తో పంచె కొంగు పట్టుకుని, మరో చేత్తో పొన్ను కర్ర వేసుకుంటూ పెద్ద బజార్న నడచి వస్తుంటే బజారంతా గప్‌చుప్ అయిపోయింది. వేప చెట్టు కింద పేకాటగాళ్ళు పారిపోయేవాళ్ళు. అలుపు తీర్చుకోటం కోసం బండి ఆపిన మూట కూలీలు గబగబా లేచి బండి తోసుకుపోయేవారు. చిల్లర కొట్లలో తూకాలు దగా లేకుండా తూచేవారు. కొసరడిగితే విసుక్కోకుండా బెల్లం ముక్క పెట్టే వారు. జనం పక్కలకి తప్పుకుని గొంతులు తగ్గించి మాట్లాడుకునేవారు. ముందు వెట్టివాళ్ళు నడుస్తుండగా, హనుమయ్య అలా బజార్లోంచి వెళ్తుంటే వూరంతా నిశ్శబ్దమైపోయినట్లుండేది.

## అమరావతి కథలు

### సత్యం శంకరమంచి

సర్కారువారి దృష్టిలో హనుమయ్యకు గొప్ప పలుకుబడి. ఆ పరగణాలో ఎక్కడన్నా శిస్తు బకాయి వుంటుందేమోగాని, హనుమయ్య హయాంలో బకాయి వుండేది కాదు.

హనుమయ్య శిస్తు వసూలు చిత్రంగా వుండేది. వదువుకున్నవాళ్ళు, పెద్దవాళ్ళ దగ్గర వసూలు కొచ్చాడనుకోండి, వచ్చి సరాసరి వరండాలో కూర్చునేవాడు. "ఏవండీ! పున్నయ్యగారూ! నన్ని వూళ్లో వుండమంటారా, వెళ్ళిపొమ్మంటారా? చెప్పండి మీరే చెప్పండి? అప్పో కాసిని మజ్జిగియ్యమ్మా దాహంగా వుంది" అని ఇంట్లోకి కేకేసి "పైవాడు నాకు పుచ్చులు బిగిస్తుంటే నేను వచ్చిపోతున్నాను. మీరేమో శిస్తు కట్టరు. ఈ పూట కట్టకపోతే నా భోజనం ఇక్కడే" అని మఠం వేసేవాడు. దాంతో పున్నయ్యగారు నవ్వుకుని శిస్తు కట్టి భోజనానికి వుండమంటే హనుమయ్య నవ్వుతూ లేచి "సరేలే, ఇంకా వసూళ్ళు లేవూ?" అంటూ వెళ్ళిపోయేవాడు. ఇక మామూలు రైతు దగ్గరకొచ్చి "సన్నాసి ముండా కొడకల్లారా! సర్కారు శిస్తు మానేస్తారా? కడుపుకు తింటున్నాం మనకు నీతి లేదంట్రా?" అని సిగ్గుపడే ట్టు చీవాట్లు పెట్టి శిస్తు వసూలుచేసేవాడు. తను బతికుండగా తన వూళ్ళో న్యాయం తప్పటానికి వీల్లేదనేవాడు. ఒకసారి చలమయ్య తన గేదెల్ని కావాలని రామయ్య చేట్లోకి మేతకి తోలాడు. రామయ్య వచ్చి హనుమయ్యకి చెప్తే వెంటనే ఆ గేదెలని బందెల దొడ్లో పెట్టించాడు. సాయంత్రమైంది. చలమయ్య వచ్చి గొల్లున గోల. "తప్పయింది బాబూ! నా బర్రెల్నిడిపించండి బాబూ! పాల వేళయింది. పాలు తీసి అమ్ముకుంటే గాని రేపటికి మాకలుండదు బాబూ!" అని హనుమయ్య కాళ్ళా వేళ్ళా పడ్డాడు. "తప్పుడు పని చేసేప్పుడు ఈ బుద్ధి ఏమయిందిరా?" అని హుంకరించి వెట్టివాళ్ళని పిలిచి ఆ గేదెల పాలు తీసి మనింట్లో ఇవ్వండ్రా" అన్నాడు హనుమయ్య.

చలమయ్యకి ఆ మర్నాడు గేదెల్ని అప్పగిస్తూ 'నీతిగా బతకరా దొంగెదవ. ఇదిగో నిన్నటి పాల డబ్బులు' అని లెక్కగట్టిచ్చి పంపించాడు.

ఒకసారి ముత్తాలమ్మ కొలుపులో దొంగతనం జరిగింది. బలిచ్చిన వేటల్ని సమానంగా వాటాలు పంచుకున్నారు. తీరా తీసుకెళ్ళేటప్పుడు చూస్తే ఒక వాటా తక్కు ఁయింది. ఎవరో దొంగతనం చేశారు. వెతకండన్నారు. సందిళ్ళన్నీ గాలించారు. మూట చంకన పెట్టుకుని పారిపోతున్న దొంగని పట్టుకున్నారు. వాడు పారుగూరి పోలయ్య. పోలయ్యని పెడ రెక్క లిరగదీసి హనుమయ్య దగ్గరికి తీసుకొచ్చాడు.

"ఎందుకు చేశావురా దొం... ం?" ఉరిమినట్టు అడిగాడు హనుమయ్య.

"తప్పయిందయ్యా! మాం ... వండుకొందామను కున్నానయ్యా" అన్నాడు త... కుని పోలయ్య.

"అయితే దొంగతనం చేస్తావంట్రా. నీతి తక్కువ కొడకా. వాణ్ణి చెట్టుక్కట్టి పొద్దున్నే వొదిలేయండ్రా" అని తీర్పు చెప్పాడు.

హనుమయ్యకి రాత్రంతా ని... ద పట్టలేదు. పొద్దున్నే పోలయ్యని విడిపించి "స్నానం చేసి రారా" అని చెప్పి తనింట్లో మాంసంతో భోజనం పెట్టించి "ఒరేయ్! తిండిమీద కోరికుంటే దొంగత... కాదురా చెయ్యాల్సింది. పనిచేసి సంపాదించుకు తినరా! ఫో" అని పంపేశాడు. కొంత కాలానికి కరువొచ్చింది. పంటలు పండలేదు. పచ్చటి పొలాలు నెర్రెలు విచ్చిపోయాయి. రైతులు కొందరు వలస పోయారు. తినటానికి గింజలు లేవు. పశువులకి గడ్డి లేదు. వరన్నం తినేవాళ్ళు జొన్న రొట్టెలు తింటు న్నారు. కాని సర్కారువారు శిస్తు వసూలు సక్రమంగా జరగవలసిందే అని పట్టుపట్టారు. హనుమయ్య దొడ్డ ఇక్కట్లో పడిపోయాడు. నయానా భయానా ఎట్టా వసూలు చేసినా శిస్తు చాలా బకాయి

## ముత్యాలవాన

వుండిపోయింది. పై అధికారులకు కోపం వచ్చింది. కట్టనివాళ్ళ ఆస్తులు జప్తు చెయ్యమన్నారు. హనుమయ్య కళ్ళనీళ్ళతో ఆస్తులు జప్తు చేశాడు. చెంబూ తప్పాలా వీధిలో వేయించాడు. వేలం పాడించాడు. కాని కొనేవాడేడి? శిస్తు బకాయి పూడలేదు. పై వాళ్ళకి మరీ కోపం వచ్చింది. బకాయి వున్న రైతుల్ని చెట్లకు కట్టేసి పాతిక దెబ్బలు కొట్టమని హుకుం వచ్చింది. ఈ సంగతి తెలిసి కొందరు పారిపోయారు. పొద్దున్నే రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ వచ్చాడు. రైతుల్ని ఓ ఇరవై మందిని చింతల తోపులోకి తీసుకొచ్చారు. అందర్నీ చెట్లకి కట్టేస్తున్నారు. హనుమయ్య దగ్గరుండి కట్టిస్తున్నాడు. అందరూ అయిపోయారు. తను ఇంకో చెట్టు కానుకు నుంచుని "నన్ను కట్టెయ్యరా" అన్నాడు. "బాబూ!" అంటూ వెట్టివాడు కాళ్ళమీద పడ్డాడు. "కట్టెయ్యరా" అని ఆజ్ఞాపించాడు హనుమయ్య.

తన్ని కూడా కట్టే... చుకున్న హనుమయ్య ఎలుగెత్తి అధికారికి చెప్పుకున్నాడు-"కొట్టండయ్యా! నన్ను కూడా కొట్టండయ్యా! నన్ను కూడా కొట్టండయ్యా! ఒంటిపూట గంజితో బతుకుతున్న ఆ రైతుల్తో నేనూ సమానమేనయ్యా! అయ్యా! మా దగ్గర డబ్బుల్లేవు. కాని, దెబ్బలకు సిద్ధమేనయ్యా!"

అధికారి దిగ్గున లేచి ఈ సంవత్సరానికి శిస్తు మాఫీ చేయిస్తానని వెళ్ళిపోయాడు. ●

### పెరగొచ్చు

హోటల్‌కెళ్లి కూర్చున్నాడు చిదంబరం. సర్వరు తెచ్చిన ఇడ్లీలు తింటూ ఆశ్చర్యంగాలడిగాడు సర్వర్ని—

"ఏంటయ్యా ఇది! ఒక ఇడ్లీ వెల డెబ్బైఐదు పైసలా?!"

"త్వరగా తిని లేవండ్సార్! లేకపోతే మీరు తిని లేచేలోపు మళ్లీ పెరిగినా పెరగొచ్చు" తాపీగా అన్నాడు సర్వరు.

ఎ.జి.మణి (చిత్తూరు)